క్లుప్తంగా

అధ్యాపకుడిని నియమించండి..

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ అధ్యాపకుడిని నియమించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కళాశాలలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కోశాధికారి గణేష్ మాట్లాడుతూ.. కళాశాలలో హిస్టరీ, సివిక్స్ సబ్జెక్టులు కలిపి ఒక్కరే అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. హిస్టరీ బోధించే అధ్యాపకుడే సివిక్స్ బోధిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని కోరారు. ఏళ్ల తరబడి మధ్యాహ్న భోజనం డిమాండ్ ఉన్నా ప్రభుత్వం దాటవేస్తోందని పేర్కొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణ స్థలం పరిశీలన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు ఈఎస్ఐ వైద్యం అందించాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పరిరక్షణ సంఘం నాయకులు పలుమార్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌ను కోరారు. స్పందించిన చైర్మన్ ఇటీవల ఢిల్లీలోని ఈఎస్ఐ కమిషనర్‌ను కలిశారు. ఆయన అంగీకరించిన నేపథ్యంలో శుక్రవారం ఆస్పత్రి ఏర్పాటుకు అనువైన స్థలం కార్మిక ప్రాంతమైన రామవరంలో ఈఎస్ఐ బృందం ప్రతినిధి చందు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పరిరక్షణ సంఘం అధ్యక్షులు రాసూరిశంకర్‌తో కలిసి పర్యవేక్షించారు.

‘శ్రీ రాగా’లో అంతరిక్ష దినోత్సవం


విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ రాగా స్కూల్‌లో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో నేషనల్ స్పేస్ డే క్విజ్‌ను ఇస్రో, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సంస్థవారు, అప్నా చంద్రయాన్ క్విజ్, ఎన్‌సీఈఆర్‌టీ వారు నిర్వహించిన క్విజ్ పోటీలలో శ్రీ రాగా విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు విచ్చేసిన కరస్పాండెంట్ మల్లారపు వరప్రసాద్, కవితలు మాట్లాడుతూ.. చంద్రయాన్–3 విజయోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడలను సమర్థవంతంగా నిర్వహించాలి

ఇల్లెందురూరల్: పాఠశాల క్రీడలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంఈఓ కృష్ణయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి మండలాల పాఠశాలల హెచ్‌ఎంలు, పీఈటీలతో సమీక్ష నిర్వహించారు. మాట్లాడుతూ.. వచ్చే నెల 10, 11 తేదీలలో పాఠశాల స్థాయిలో, 19, 20 తేదీలలో జోనల్ స్థాయిలో క్రీడలు నిర్వహించాలని చెప్పారు.

ఉద్యోగ భద్రత కల్పించండి..

పాల్వంచ: స్వచ్ఛ భారత్ పేరుతో ఇంటింటి చెత్త సేకరిస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10వేల వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు అన్నారపు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ దాకూ నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

వసతులు కల్పించాలి

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్రా వీరభద్రం డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తగూడెం లక్ష్మీదేవిపల్లిలోని డిగ్రీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా హర్షవర్ధన్, మనోజ్‌కుమార్, మరో ఆరుగురు సభ్యులను ఎన్నుకున్నారు.

25న గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పాటు

కొత్తగూడెంరూరల్: భజన మందిరం రోడ్డులోని వివేకానంద విద్యాలయంలో ఈనెల 25న గణేష్ ఉత్సవ సమితి నూతన కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు దార రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు, దార్మికవాదులు, మండప నిర్వాహకులు హాజరు కావాలని కోరారు.

గ్రామసభ

పాల్వంచరూరల్: రంగాపురం గ్రామంలో శుక్రవారం అధికారులు గ్రామపంచాయతీ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. స్థానిక గిరిజనుడు భద్రు పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. బంక్ ఏర్పాటుపై గ్రామసభలో చర్చించి తీర్మానాన్ని ఆమోదించారు.

ఇక స్థానిక ఎన్నికల సమరం

- ఎన్నికల సంఘం ఆదేశంతో అధికారులలో కదలిక
- పంచాయతీలకు చేరిన అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల వివరాలు
- వార్డు, పంచాయతీ వారీగా జాబితా సరిచేసే పనిలో నిమగ్నం


పోలారం గ్రామపంచాయతీ కార్యాలయం

ఇల్లెందురూరల్: పల్లెల్లో స్థానిక ఎన్నికల కసరత్తు ప్రారంభమైంది. సెప్టెంబర్ 21 నాటికి పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో తుది ఓటరు జాబితా ప్రచురించాలని ఎన్నికల సంఘం ఆదేశించడంతో అధికారులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. అసెంబ్లీ ఓటరు జాబితా ఆధారంగా వార్డులు, పంచాయతీ వారీగా ఓటరు జాబితా సవరించే పనిలో క్షేత్రస్థాయి అధికారులు నిమగ్నమయ్యారు.

మండలంలో ఓటర్ల వివరాలు..

అసెంబ్లీ ఓటరు జాబితా ప్రకారం మండలంలో మొత్తం 54 పోలింగ్ బూత్‌ల పరిధిలో 48,338 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 23,432 కాగా మహిళలు 24,905, ట్రాన్స్‌జెండర్ ఒకరు ఉన్నారు. అయితే మున్సిపాలిటీకి సంబంధించిన ఓట్లు మండలంలోని పోలింగ్ బూత్‌లలో నమోదు కావడం, మండలంలోని ఓట్లు మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ బూత్‌లలో నమోదై ఉండటంతో తుది జాబితా సమయానికి మండలంలో పోలింగ్ బూత్‌ల సంఖ్యతోపాటు ఓటర్ల సంఖ్య కూడా కొంతమేర తగ్గే అవకాశం ఉంది.

నివాసం ఒక చోట.. ఓటు మరోచోట..

అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూపొందించిన ఓటరు జాబితాలో చోటుచేసుకున్న తప్పిదాలను గుర్తించి సరిచేసేందుకు అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రధానంగా ఒక వార్డు పరిధిలోని ఓట్లు మరో వార్డుకు సంబంధించిన జాబితాలో నమోదయ్యాయి. మరికొన్ని చోట్ల ఏకంగా ఒక పంచాయతీకి సంబంధించిన ఓట్లు మరో పంచాయతీ పరిధిలోని పోలింగ్ బూత్‌లలో ఉన్నాయి. ఇలా గందరగోళంగా ఉన్న జాబితాను సరిచేసి సెప్టెంబర్ 21నాటికి సిద్ధం చేసి పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. దీనికోసం పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో కసరత్తు ప్రారంభించారు.

సరిచేయాల్సిన వివరాలు..

మండలంలోని 45, 47వ పోలింగ్ బూత్‌ల పరిధిలో ఒడ్డుగూడెం, చల్లసముద్రం గ్రామపంచాయతీల ఓట్లు కలిసి ఉన్నాయి. 55, 56 పోలింగ్ బూత్‌లు సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీలో ఉండగా ఆయా బూత్‌లలో మున్సిపాలిటీ పరిధిలోని 24 ఏరియా, మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ ఓటర్లు ఉన్నారు. అదే విధంగా 57, 58 పోలింగ్ బూత్‌లు మున్సిపాలిటీ పరిధిలోని 24ఏరియాలో ఉండగా ఆయా బూత్‌లలో 24ఏరియాతోపాటు మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీకి చెందిన ఓటర్లు కూడా ఉన్నారు. 64వ పోలింగ్ బూత్‌లో ముత్తారపుకట్ట, మస్సివాగు గ్రామపంచాయతీల ఓటర్లు కలిసే ఉన్నారు. 125వ పోలింగ్ బూత్‌లో సుదిమళ్ల గ్రామపంచాయతీ, బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ కొల్లాపురం గ్రామ ఓటర్లు ఉన్నారు.

గతంలో అస్పష్టంగా వార్డుల విభజన...

మండలంలోని 29 గ్రామపంచాయతీల పరిధిలో వార్డుల విభజన కూడా కొంత సమస్యాత్మకంగా ఉంది. 2019లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో కొన్ని గ్రామపంచాయతీలలో వార్డుల విభజనపై విమర్శలు వెల్లువెత్తాయి. ఉదాహరణకు మండలంలోని పెద్ద గ్రామపంచాయతీలలో ఒకటైన సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో ఒక వార్డుకు సంబంధించిన ఓటర్లను పంచాయతీ పరిధిలో అక్కడక్కడ సేకరించి వార్డుగా రూపొందించారు. దీంతో సంబంధిత వార్డుకు భౌతిక స్వరూపం లేకుండా పోయింది. ఇలాంటి వార్డులు మండలంలోని పలు గ్రామపంచాయతీలలో నమోదై ఉన్నాయి. ఫలితంగా ఆయా వార్డులలో విజయం సాధించిన సభ్యులు చేసేందుకు పెద్దగా పనులు లేకుండా పోతున్నాయి. ఈసారి ఓటరు జాబితా సిద్ధం చేసే సమయంలో గతంలో చోటుచేసుకున్న పొరపాట్లను గమనంలోకి తీసుకొని తప్పిదాలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఓటర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.


సుదిమళ్ల గ్రామపంచాయతీలో ఓటరు జాబితాపై కసరత్తు చేస్తున్న అధికారులు, సిబ్బంది

ఓటరు జాబితా సిద్ధం చేస్తున్నాం...



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ, వార్డుల వారీగా ఓటరు జాబితాపై కసరత్తు ప్రారంభించాం. అసెంబ్లీ ఓటరు జాబితా ఆధారంగా కసరత్తు జరుగుతోంది. సెప్టెంబర్ 21న నాటికి జాబితా సిద్ధం చేసేలా చర్యలు తీసుకుంటాం. తప్పిదాలకు అవకాశం లేకుండా పకడ్బందీగా జాబితా సిద్ధం చేస్తాం.

– ధన్‌సింగ్, ఎంపీడీఓ, ఇల్లెందు మండలం

సొసైటీలో అక్రమాలపై చర్యలు తీసుకోండి..

ఇల్లెందురూరల్: పీఏసీఎస్‌లో యూరియా విక్రయాల అక్రమాలకు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండలశాఖ మాజీ అధ్యక్షుడు అజ్మీర భావ్‌సింగ్ డిమాండ్ చేశారు. యూరియా విక్రయాలపై శుక్రవారం విచారణ కొనసాగుతున్న సమయంలో కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు పీఏసీఎస్ అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఏసీఎస్‌లో నిబంధనల పేరిట రైతులను ఇబ్బంది పెడుతూ ప్రైవేటు వ్యాపారులకు అక్రమంగా యూరియాను తరలించడం రైతులను మోసం చేసినట్లేనని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులు రైతుల పేరుతో ఆధార్‌కార్డులు సంపాదించి వందల బస్తాలను అక్రమమార్గంలో తమ దుకాణాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని, ఇందుకు మాణిక్యారంలో వెలుగుచూసిన అక్రమ నిల్వలే ప్రత్యక్ష నిదర్శనం అని పేర్కొన్నారు. అధికారులు తక్షణం స్పందించి మాణిక్యారంలో అక్రమాలకు పాల్పడిన వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు లైసెన్స్ రద్దు చేయాలని, అతన్ని డీసీసీబీ డైరెక్టర్ పదవికి అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హరిప్రసాద్, బానోత్ బిచ్చా, అజ్మీర శంకర్, గుగులోత్ కిరణ్, గుగులోత్ మాన్య తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: ఇల్లెందు సహకార పరపతి సంఘంలో అక్రమాలు జరుగుతున్నాయని, రైతులకు అందాల్సిన ఎరువులను వ్యాపారులకు సరఫరా చేస్తున్నారని, మాణిక్యారం గ్రామంలో ఓ వ్యాపారి వద్ద పట్టుబడిన 70 బస్తాల యూరియా ఇందుకు సాక్ష్యం అని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు నాయిని రాజు అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని మాస్‌లైన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏళ్ల తరబడి అక్కడి ఉద్యోగులు వ్యాపారులతో కుమ్మక్కై దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. రైతుల ఆధార్ కార్డులు చూపి వ్యాపారులు తరలించుకు వెళ్లటం ఇక్కడ పరిపాటిగా మారిందన్నారు. తక్షణమే ఇక్కడి చైర్మన్, సీఈఓను సస్పెండ్ చేయాలని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆవుల కిరణ్, అజ్మీరా బిచ్చా, ఆర్ఎస్ బోసు, శంకర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కొత్తగూడెంఅర్బన్: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం రైల్వేస్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు శుక్రవారం ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో డీఎస్పీ మాట్లాడారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సహకరించాలన్నారు. మంచి పనులు చేస్తున్న 15 మంది ఆటో డ్రైవర్లను గుర్తించి ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి, త్రీటౌన్ ఎస్సై పురుషోత్తం పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్ ప్రవేశాలకు దరఖాస్తులు

జూలూరుపాడు: తెలంగాణ ఓపెన్ స్కూల్ అడ్మిషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం తహసీల్దార్ కె.స్వాతి బిందు చేతుల మీదుగా ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ టి.లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ.. చదువును మధ్యలో ఆపినవారు మళ్లీ టెన్త్, ఇంటర్ చదువుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఉద్యోగులు ప్రమోషన్, ఉద్యోగ భద్రత కోసం ఓపెన్ టెన్త్, ఇంటర్ చదువుకోవచ్చన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో చదువుకోవచ్చని చెప్పారు. అంతకముందు మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ గుగులోత్ వెంకట్, సెర్ప్ కార్యాలయ ఉద్యోగులు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

వైద్యశిబిరం

జూలూరుపాడు: మాచినేనిపేట తండాలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. సీహెచ్‌ఓ రామకృష్ణ మాట్లాడుతూ.. జ్వరంతో బాధపడుతున్న వారి రక్త నమూనాలను సేకరించామన్నారు. ప్రజలకు పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్ఎం ఝాన్సీరాణి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీ విద్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ఓబీసీ న్యాయవాదుల సదస్సు


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

కొత్తగూడెంటౌన్: 25న హైదరాబాద్‌లో జరగనున్న ఓబీసీ (ఐఎల్‌పీఏ) న్యాయవాదుల సదస్సును విజయవంతం చేయాలని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓబీసీ ఉద్యమంలో భాగస్వాములను చేయడానికి 25వ తేదీన హైదరాబాద్‌లోని జేఎన్ఎఫ్‌యూ మాసబ్ ట్యాంక్ వద్ద రాష్ట్ర స్థాయి ఇండియన్ లీగల్ ప్రొఫెనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) తెలంగాణ రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని జిల్లాల నుంచి ఓబీసీ న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, న్యాయమైన పోరాటానికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు సింగు ఉపేందర్, జె.గోపికృష్ణ, విజయభాస్కర్‌రెడ్డి, పెసరమల్లి నాగేశ్వరావు, ధూళిపాల రవి, నరసింహాచారి, సంజీవరావు, లక్కినేని వెంకటదుర్గారావు, టీ.నరేంద్రబాబు, అనుదీప్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి


అధ్వానంగా ఉన్న కరివారిగూడెం బీటీ రోడ్డు

జూలూరుపాడు: కరివారిగూడెం – కొమ్ముగూడెం గ్రామాల మధ్య బీటీ రోడ్డు దెబ్బతినడంతో ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కరివారిగూడెం గ్రామస్తులు కోరుతున్నారు. శుక్రవారం స్థానికులు రోడ్డుపై ఏర్పడిన గుంతలు కన్పించే విధంగా సున్నంతో మార్కింగ్ చేశారు. మాట్లాడుతూ.. 15 ఏళ్ల క్రితం నిర్మించిన బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో నరకయాతన పడుతున్నట్లు చెప్పారు. కరివారిగూడెం, కరివారిగూడెం కాలనీ, తవిసిగుట్టతండా, బాడవప్రోలు, కొమ్ముగూడెం గ్రామాల ప్రజలంతా ఇబ్బందిపడాల్సి వస్తోందన్నారు. ఈ రహదారిపై రాత్రి వేళల్లో బైక్, ఆటో, ట్రాలీ, కారు నడపడం కష్టంగా ఉందన్నారు. ప్రమాదాల బారినపడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

లాభాల్లో 30శాతం వాటా ఇవ్వండి..


సీఎండీ బలరామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు 30 శాతం వాటా ప్రకటించాలని శుక్రవారం సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఇనపనూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్‌కు కొత్తగూడెంలోని ఆయన చాంబర్‌లో వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... కోలిండియాలో అమలవుతున్న హైపవర్ వేతనాలు సింగరేణిలో కూడా చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని, అదే విధంగా 2023–24లో కంపెనీకి వచ్చిన లాభాల్లో కార్మికులకు 30శాతం లాభాల వాటాను ప్రకటించి తమ జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. గతేడాది 18 రోజులు సమ్మె చేసిన క్రమంలో ప్రభుత్వం జీఓ నంబర్ 22 ప్రకారం వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, కంపెనీ అధికారులు అగ్రిమెంట్‌పై సంతకాలు చేసినా అమలుకు నోచుకోలేదన్నారు. స్పందించిన సీఎండీ కాంట్రాక్ట్ కార్మికుల బాధలు తనకు తెలుసని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమార్గం చూస్తామన్నారు. దొడ్డి నిర్మల, ఎడ్ల రాకేష్, పంగ రాములు, కొమ్ము నాగేశ్వరరావు, మార్కెట్ అనిత, కందుకూరి భాగ్యలక్ష్మి, గుర్రం సృజన్, శ్రీనివాస్, పిట్టల శేఖర్ పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు చెల్లించాలి

పాల్వంచ: పాల్వంచ ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న పేషెంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ కార్మికుల ఐదు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు బండి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో సైతం కార్మికులు వేతనాలు రాక ఇబ్బందులు పడ్డారని, కొత్త ప్రభుత్వంలో కూడా ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఆస్పత్రిలో అన్ని పనులు చేస్తున్న కార్మికుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, డి.సుధాకర్, శంకర్, కనకదుర్గ, రాము, పద్మ, నాగలక్ష్మి, కిరణ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో సమస్యలు పరిష్కరించండి..


నిల్వ నీటిని పరిశీలిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): జిల్లా కేంద్రంలో సమస్యలను పరిష్కరించడమే కాక మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం సర్వజన ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ.. ఆస్పత్రిలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో చికిత్స కోసం వచ్చే వారికి కొత్త వ్యాధులు వస్తున్నాయని పేర్కొన్నారు. గత నెలలో తమ పరిశీలనలో వెల్లడైన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదన్నారు. ఇకనైనా డ్రెయినేజీ సమస్యతో పాటు ఎమర్జెన్సీ వార్డ్‌లో వెంటిలేటర్లు అందుబాటులోకి తీసుకురావాలని, వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు, డి.వీరన్న, సందకూరి లక్ష్మి, నందిపాటి రమేష్, వీరభద్రం, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల నిరసన


జీఓ కాపీలను దహనం చేస్తున్న ఉపాధ్యాయులు

పాల్వంచ: సీపీఎస్‌కి వ్యతిరేకంగా టీజీ సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని బొల్లేరుగూడెం హైస్కూల్‌లో సీపీఎస్ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత ప్రభుత్వం 2014 ఆగస్టు 23న ఉద్యోగ, ఉపాధ్యాయులను సంప్రదించకుండా సీపీఎస్‌లోనే కొనసాగుతామని కేంద్ర ప్రభుత్వానికి సమ్మతి తెలియజేస్తూ జీఓ నంబర్ 28ని జారీ చేసిందన్నారు. దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా 1.50 లక్షల మంది ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తం అవుతోందన్నారు. సమస్య పరిష్కారానికి అన్నిచోట్ల ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందిస్తామన్నారు. అనంతరం జీఓ కాపీలను దహనం చేశారు. రాజశేఖర్, శ్రీనివాస్, రామకృష్ణ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టేకులపల్లి: సీపీఎస్ రద్దు అమలు కోరుతూ శుక్రవారం టేకులపల్లి మండలంలో తెలంగాణ సీపీఎస్ బాధిత ఉద్యోగుల సంఘం (టీఎస్‌సీపీఎస్ఈయూ) ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి బ్లాక్‌డే నిర్వహించారు. రమణ, ఫూల్‌సింగ్, నాగునాయక్, హతీరామ్, వీరన్న, రమేష్‌బాబు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

జూలూరుపాడు: ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి యాసా నరేష్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా సగం మందికి కూడా రుణమాఫీ కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతల్లో రూ.2 లక్షల రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుతుందోని, క్షేత్రస్థాయిలో అలాంటి పరిస్థితి లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాపాస్ పుస్తకాలు లేకపోయినప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వకపోగా, రుణమాఫీ కూడా చేయలేదని విమర్శించారు. అనంతరం తహసీల్దార్ స్వాతి బిందుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బానోత్ ఇస్రా, గార్లపాటి వెంకటి, గడిదేశి కనకరత్నం, లకావత్ శ్రీను పాల్గొన్నారు.

షరతులు పెట్టొద్దు..

సుజాతనగర్: షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లావుడ్యా సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతీ రైతుకు రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు షరతులు విధించడం తగదన్నారు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని కోరారు.

విద్యుత్ కోతలు.. జనం వెతలు

గంటకోసారి కోతలలతో జనం ఉక్కిరిబిక్కిరి


టేకులపల్లి విద్యుత్ సబ్ స్టేషన్

టేకులపల్లి: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా ఉంది మండల ప్రజల పరిస్థితి. రైతుబంధు, రుణమాఫీ, ఉచిత బస్సు, 200 యూనిట్ల విద్యుత్ ఉచితం, పింఛన్లు అమలవుతున్నాయి. ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డులు, రూ.500లకే గ్యాస్ పథకాలు త్వరలోనే అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ విద్యుత్ కోతలకు మాత్రం బ్రేక్ పడటం లేదు. వేసవికాలంలో కరెంట్ కటింగ్‌లు బాగా ఉండేవి. ప్రస్తుతం వర్షాకాలంలో కూడా విద్యుత్ అధికారులు ఇష్టారాజ్యంగా విద్యుత్ కోతలు పెడుతున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో కరెంట్ ఉండడం లేదు. టేకులపల్లి, కోయగూడెం, బోడు, బొమ్మనపల్లి నాలుగు సబ్‌స్టేషన్లు ఉన్నప్పటికీ గంటకోసారి విద్యుత్ కోత విధిస్తుండటం వల్ల అసలే వర్షాకాలం కావడం దోమలు, ఈగలతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ఫ్యూజులు పోయాయని, మరమ్మతులని, మెయింటనెన్స్ అని, జంగిల్ కటింగ్ అని ఇలా ఏదో ఒక పేరుతో విద్యుత్ కోత విధిస్తుండటంతో జనం విసిగిపోతున్నారు. మరోవైపు విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత కూడా తీవ్రంగా ఉండటం గమనార్హం. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆందోళన చేపడతాం..



వేళాపాల లేకుండా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నాం. పదేపదే కరెంట్ తీస్తుండటంతో విసుగు వస్తోంది. విద్యుత్ కోతల సమస్యపై స్థానిక ఎమ్మెల్యే స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

– నోముల భానుచందర్, టేకులపల్లి

జ్వరాల బారిన పడుతున్నాం..



ఫ్యాన్లు, కూలర్లకు జనం అలవాటు పడ్డారు. అసలే వర్షాకాలం. దోమలు, ఈగలతో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇప్పటికే మా ఇంట్లో పిల్లలకు జ్వరాలు వచ్చి వారం రోజులు. అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలి.

– దారావత్ రాజేందర్ , ముత్యాలంపాడు క్రాస్‌రోడ్

సాంకేతిక సమస్యలున్నాయి..



ప్రత్యేకంగా విద్యుత్ కోతలు ఏమీ లేవు. అప్పుడప్పుడు జంపర్ కటింగ్, ఫ్యూజులు పోవడం, పక్షులు, కోతులు తీగలపై పడటం, ట్రాన్స్‌ఫార్మర్లు బ్లాస్ట్ కావడం వల్ల కాసేపు నిలిపి వేయాల్సి వస్తోంది. వెంటనే ఉన్న సిబ్బందితో పరిష్కరిస్తున్నాం.

– హట్కర్ దేవా, ఏఈ టేకులపల్లి